క్లుప్తంగా

బెయిల్ కోసం ఉచిత న్యాయ సహాయం



సబ్‌జైలు ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్

నరసాపురం: సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న ఖైదీలు బెయిల్ కోసం లాయర్‌ను నియమించుకునే స్తోమత లేకపోతే మండల న్యాయసేవాధికా సంస్థను ఆశ్రయించ వచ్చని నరసాపురం అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.శ్రీనివాస్ చెప్పారు. జడ్జి శ్రీనివాస్ శనివారం నరసాపురం సబ్ జైలును తనిఖీ చేశారు. ఖైదీలతో జైలు అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, రోజువారీ ఇస్తున్న ఆహారం నాణ్యత వంటి అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు, ఉచిత న్యాయవాది కె.శిరీష, పారాలీగల్ వలంటీర్ డి.వరలక్ష్మి పాల్గొన్నారు.

వేగంగా జగనన్న కాలనీ రహదారి నిర్మాణం



వదలి చాకిరేవు పుంతలో రహదారి నిర్మిస్తున్న దృశ్యం

పెనుగొండ: వదలి చాకిరేవు పుంతలోని జగనన్న కాలనీకి రహదారిని వేగంగా నిర్మిస్తున్నారు. జగనన్న కాలనీకి రహదారి అధ్వానంగా ఉండడంతో గడపగడపకూ మన ప్రభుత్వంలో కాలనీ వాసుల రహదారి అవస్థలు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో సత్వరం స్పందించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో గృహనిర్మాణ శాఖ నుంచి రూ.31.50 లక్షల నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. షట్రు నిర్మాణం పూర్తి కావడంతో జీఎస్‌బీతో నిర్మాణం ప్రారంభించారు. రహదారి నిర్మాన పనులను గ్రామ సర్పంచ కాసాని విజయలక్ష్మి పెద్దిరాజు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన దుర్గా భవానీ బాబీ, హైసింగ్ ఏఈ బి.లక్ష్మణ్ తదితరులు పర్యవేక్షించారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి

పెనుగొండ: నెలరోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్షను విజయవంతం చేయాలని తహసీల్దారు ఎస్.గురుమూర్తి రెడ్డి అన్నారు. శనివారం పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులు మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి జూలై 22 వరకూ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామ సచివాలయాల్లో ప్రజలకు కావాల్సిన 9 రకాల సేవలకు సంబంధించిన ధ్రువ పత్రాలు త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్ దొర, వలంటీర్లు పాల్గొన్నారు.

20న సీజ్ చేసిన వాహనాల వేలం

సాక్షి, భీమవరం: ఎక్సైజ్ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 20న వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ శనివారం చెప్పారు. వేర్వేరు ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను భీమవరం సెబ్ కార్యాలయం ఆవరణ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు విధిగా రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. అలాగే ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. పాటదారులు పాడుకున్న మొత్తానికి అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలని వర్మ స్పష్టం చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

పాలకోడేరు: మోగల్లు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పై ఇంజనీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ) శ్రీనివాస్ శుక్రవారం విచారణ చేశారు. గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనికి రాని వ్యక్తులకు మస్తర్లు వేసి వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యేలా అక్రమాలకు పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ అనిశెట్టి దుర్గాప్రసాద్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఎంపీడీవో మురళి గంగాధరరావు దృష్టికి తీసుకెళ్లామని ఆయన ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంగ్లీషు బోధనలో మెలకువలు తెలుసుకోవాలి

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కళాశాల ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిషు బోధన నూతన విద్యావిధానాన్ని అధ్యాపకులు తప్పని సరిగా నేర్చుకోవాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు ఇంగ్లీషు విద్యాబోధన రెండవవిడత శిక్షణ శనివారం సాయంత్రం ముగించారు. ఈ సందర్భంగా ముగింపు సమావేశంలో పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంగ్లిషు బోధనలో మెలకువలు అధ్యాపకులు తప్పని సరిగా తెలుసుకోవాలన్నారు. సమావేశంలో రిసోర్స్‌సెంటర్ కో ఆర్డినేటర్లు, మాస్టర్ ట్రైనర్స్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

పాఠశాల విద్యలో నూతన విప్లవం

- ప్రారంభోత్సవం నాడే విద్యా కానుక
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



జీవీఎస్‌వీఆర్ఎం పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను అందిస్తున్న దృశ్యం (ఫైల్)



ప్రభుత్వం అందించే విద్యాకానుక కిట్

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాల విద్యలో నూతన విప్లవం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలలు తెరిచిన వెంటనే నోటు పుస్తకాలు, టెస్ట్ పుస్తకాలు అందజేయడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాఠశాలలు తెరిచిన మూడు నాలుగు నెలలకు గానీ పుస్తకాలు వచ్చేవికాదు. కానీ ఈ సంవత్సరం పాఠశాలలు తెరవకుండానే పుస్తకాలు మండల ఎడ్యుకేషన్ కేంద్రానికి చేరుకున్నాయి. దానితో పాఠశాలలు తెరిచిన వెంటనే ఉపాధ్యాయులు విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్నారు. పట్టణంలో 6 ఉన్నత పాఠశాలలు, 2 ఎయిడెడ్, 22 ఎలిమెంటరీ పాఠశాలలు, పాలకొల్లు మండలంలో 7 ఉన్నత పాఠశాలలు, 1 ఎయిడెడ్, 59 ఎలిమెంటరీ పాఠశాలలు, యలమంచిలి మండలంలో 11 ఉన్నత పాఠశాలలు, 73 ఎలిమెంటరీ పాఠశాలలు మొత్తం 181 పాఠశాలలు ఉన్నాయి. అలాగే పట్టణం, మండలంలో 8201 విద్యార్థులు, యలమంచిలి మండలంలో 5264 మంది మొత్తం 13,465 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు అందరికీ జగనన్న విద్యా కానుకలో నోటు బుక్స్, టెస్ట్‌బుక్స్, బ్యాగ్స్, షూస్, సాక్సులు, యూనిఫాం, బెల్ట్‌లు అందజేస్తున్నారు. ఎండలు తీవ్రత దృష్ట్యా శనివారం వరకూ ఒంటి పూట బడులు నిర్వహించారు. సోమవారం నుంచి రెండు పూటలా బడులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో నాడు–నేడులో పాలకొల్లు మండలం, పట్టణంలో మొదటి ఫేజ్‌లో రూ. 9 కోట్లతో 36 పాఠశాలలు, సెకండ్ ఫేజ్‌లో రూ. 13 కోట్లతో 28 పాఠశాలలు, యలమంచిలి మండలంలో మొదటి ఫేజ్‌లో రూ. 4.6 కోట్లతో 26 పాఠశాలలు, సెకండ్ పేజ్‌లో రూ. 10.1 కోట్లతో 31 పాఠశాలలు అభివృద్ధి చేశారు.

ఇప్పటివరకు ఎప్పుడూ చూడలేదు



నేను మూడో తరగతి వరకూ పోడూరు మండలం అప్పిచెరువు ఎలిమెంటరీ స్కూల్లో చదువుకున్నాను. నాడు పాఠ్యపుస్తకాలు స్కూల్ ప్రారంభం అయిన రెండు మూడు నెలలకు వచ్చేవి. నేడు స్కూల్ తెరిచిన వెంటనే పుస్తకాలు ఇవ్వడం చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా విద్యకు ఆటంకం లేకుండా అమ్మఒడి పథకం ఎంతో భరోసా కల్పిస్తుంది.

– సౌజన్య, 10వ తరగతి, టీవీఆర్ఎం గరల్స్ హైస్కూల్, పాలకొల్లు

గతం కంటే సరికొత్తగా..



మా పాఠశాలలో గతంలో కన్నా బాగా తయారు చేశారు. స్కూల్ కొత్తగా అనిపిస్తుంది. స్కూల్‌కు వచ్చిన రోజునే బ్యాగ్‌లు, యూనిఫాంలు, షూస్, సాక్సులు పుస్తకాలు ఇచ్చారు. స్కూల్ గోడలపై దేశనాయకుల చిత్రపటాలు ఎంతగానో ఆకర్షణీయంగా ఉంటున్నాయి.

– అందే రేవంత్, ఐదో తరగతి, జీవీఎస్‌విఆర్ఎం ఎలిమెంటరీ పాఠశాల

డీఎన్నార్‌లో ఆన్‌లైన్ హెల్ప్‌లైన్ సెంటర్

సాక్షి, భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి విద్యార్థులు డిగ్రీ కోర్సులో ఆన్‌లైన్ ప్రవేశం పొందడానికి హెల్ప్‌లైన్ సెంటర్‌ను కళాశాలలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో ఏర్పాటు చేసిన సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), బీఎస్ శాంతకుమారి పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం ప్రశాంతం

వీరవాసరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన నిర్వహించారు. మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్షలు చేపట్టారు. మండలంలోని ప్రజా సమస్యలపై అధికారులు తక్షణం స్పందించాలని వారు సూచించారు.

పిల్లలను బడికి పంపించడమే ధ్యేయం



చినమామిడిపల్లిలో నగదు బహుమతులు అందిస్తున్న దృశ్యం



కొడమంచిలిలో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం: పేద, మధ్య తరగతి వారు తమ పిల్లలను పనులకు పంపకుండా బడులకు పంపడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయంగా పెట్టుకున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని అన్నారు. శనివారం పట్టణంలోని చినమామిడిపల్లి, పీచుపాలెం హైస్కూళ్లలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. 10వ తరగతిలో టాప్‌-3 స్థాయిలో మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ 3 వేలు, రెండో బహుమతిగా రూ 2 వేలు, మూడవ బహుమతిగా రూ.1000లు నగదు, సర్టిఫికెట్‌లు అందించారు. కార్యక్రమంలో కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బర్రి లీల, కౌన్సిలర్లు బొమ్మిడి సూర్యకుమారి, పాలూరి బాబ్జి, బళ్ల తాతాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యపై ప్రత్యేక శ్రద్ధ క శ్రద్ధ

పెనుగొండ: దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వ విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి కార్పొరేట్ స్థాయి విద్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్నారని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. శనివారం కొడమంచిలిలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన పెదపూడి సుప్రియ (తీర్థాల పుంత), వర్దనపు స్పందన(బీపీ చెరువు), చికిలే సౌజన్య(చినపేట)లకు మెడల్స్, సర్టిఫికెట్లు అందించి అభినందించారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బొరుసు రాంబాబు, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండేటి రమేష్, సచివాలయ కన్వీనరు టీఎస్‌డీ చంద్రశేఖర్, వైఎస్సార్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సాక సురేష్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పడమటిపాలెంలో పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి విజయలక్ష్మి

మొగల్తూరు: నాడు–నేడులో చేపట్టిన పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలను త్వరతగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి ఆదేశించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాడు నేడు ఫేజ్‌-2లో 46 పాఠశాలలు, 10 అంగన్‌వాడీ కేంద్రాలను రూ.17.85 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను త్వరతగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మొగల్తూరు పంచాయతీ పడమటిపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో చేపట్టనున్న పాఠశాల అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ వొంద్రు బాబ్జి రాజు, పీఆర్ ఏఈ అశోక్, హౌసింగ్ ఏఈ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్ ఆక్రమణలను అడ్డుకోవాలి

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని బత్తులవారిపేటకు వెళ్లే దారిలో వాలుతూర ప్రాంతంలో ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి నిర్మించిన పెంకుటి షెడ్డు చుట్టూ కాంక్రీట్ వేయడానికి ఆక్రమణదారులు ప్రయత్నిస్తున్నారని దానిని అడ్డుకోవాలని కోరుతూ శనివారం జగనన్నకు చెబుదాం నెంబరు 1902కు ఫిర్యాదు చేసినట్లు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నిమ్మకాయల రామకృష్ణ చెప్పారు. ఈ షెడ్డును గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ బత్తుల రాజు, అతని కుమారుడు రాజ్‌కుమార్ ఆక్రమించి నిర్మించారన్నారు. షెడ్డు నిర్మాణ సమయంలోనే పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులు నిలుపుదల చేశారన్నారు. ఇది జరిగి ఆరు నెలలు అయ్యిందన్నారు. ఇప్పుడు షెడ్డు చుట్టూ కాంక్రీట్ వేయడానికి మెటల్ దింపారన్నారు. శనివారం, ఆదివారం రావడంతో అధికారులు రాని సమయంలో కాంక్రీట్ వేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తే వారు స్పందించలేదన్నారు. దీంతో 1902కు ఫోన్ చేసినట్లు ఆయన వివరించారు. ఈ షెడ్డు వల్ల అటు రైతులతో పాటు ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ ఆక్రమణలను అడ్డుకోవాలని కోరారు.

మోడల్ పట్టణంగా పాలకొల్లు



28వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ మౌలిక వసతులైన రోడ్లు, డ్రెయినేజీ, మంచినీరు సమస్యలు తక్షణం పరిష్కరించి మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పలు వార్డులో మునిసిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపనలు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల పేరుతో శిలాఫలకాలు వేయించుకుని కమీషన్లు దండుకునేవారన్నారు. టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల చేసిన తప్పిదాల వల్లనే పట్టణంలో పారిశుధ్యం, మంచినీరు, డ్రెయినేజీ తదితర సమస్యలు అలాగే మిగిలిపోయాయన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని పల్లపు ప్రాంతాల్లో ఎక్కడా మురుగునీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్సీ శ్రీనివాస్ చెప్పారు.

రూ.కోటితో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పట్టణంలోని 28వ వార్డులో నాలుగు పనుల నిమిత్తం రూ.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. 29వ వార్డులో రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు, బ్రాడీపేట 5వ వీధిలో రూ.14 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. అలాగే పట్టణంలోని 8వ వార్డులో స్పందన అపార్టుమెంట్ వెనుక వీధిలో రూ.14 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను, కల్వర్టు పనులను పరిశీలించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి డీటీడీసీ బాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, వార్డు ఇన్‌చార్జ్‌లు శీలం సూరిబాబు, దొమ్మేటి వెంకట్రావు, యలకల రంగ, ఇజ్జాడ చినబాబు, గేదెల నరసింహారావు, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, నంబూరు గంగా పవన్, పార్టీ నాయకులు ఖండవల్లి వాసు, పీటర్‌సన్ చిన్ని, శంకరాపు శ్రీను, బండి రమేష్, మోర్త గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్‌కు ప్రభుత్వ భరోసా



జిన్నూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న సీడీపీఓ సీహెచ్ ఇందిర



దొడ్డిపట్ల అంగన్‌వాడీ కేంద్రం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



నరసాపురంలో విద్యార్థులను అభినందిస్తున్న సీడీపీఓ ఊర్మిళ

పోడూరు: చిన్నారుల భవితకు భరోసానిచ్చేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యాబోధన జరుగుతుందని పాలకొల్లు ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం జిన్నూరు ఎస్ఆర్‌పేట హబ్ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యూషన్ డే, జనభాగీదారీ కార్యక్రమం నిర్వహించచరు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు సీడీపీఓ ఇందిర, సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి చేతుల మీదుగా సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ ప్రీ స్కూల్లో ప్రతిరోజూ చిన్నారులకు మాట, ఆట, పాట, కథలు చెప్పడంతో పాటు సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మూడేళ్లు నిండిన పిల్లలకు పీపీ1 సిలబస్, 4 ఏళ్లు నిండిన పిల్లలకు పీపీ2 సిలబస్ చెబుతారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ నాగరత్నం, సూపర్‌వైజర్ జి.హేమతులసి, ఎంఎస్‌కే అంజలి, వార్డు సభ్యురాలు పితాని కనకదుర్గ, అంగన్‌వాడీ టీచర్లు రావూరి సూర్యకుమారి, బి.లక్ష్మీభాయి, ఎ.సునీత, ఎల్.ఉషారాణి పాల్గొన్నారు.

భగ్గేశ్వరంలో...

పాలకొల్లు అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో పాటు సృజనాత్మకతతో కూడిన విద్యాబోధన చిన్నారులకు అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. మండలంలోని భగ్గేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి చిన్నారులకు పై తరగతుల్లో చేరేందుకు యోగ్యతా పత్రాలను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. సీనియర్ సూపర్‌వైజర్ ఎస్.మల్లేశ్వరి మాట్లాడుతూ మండలంలోని 215 మంది చిన్నారులను పై తరగతుల్లో చేరేందుకు అర్హత సాధించారన్నారు. అలాగే మండలంలోని 78 అంగన్‌వాడీ కేంద్రాల్లో 213 మంది చిన్నారులు కొత్తగా చేరారని వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అందె మార్కొండేయులు, అందే అంకయ్య, కోళ్ల శ్రీనివాస్, బి విశ్వేశ్వరరావు, సూపర్‌వైజర్ ఎస్.మంగ, సెక్టార్ లీడర్లు ఎం శ్రీదేవి, గోగులమండ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: తల్లిదండ్రులు మూడేళ్లు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని మండల ప్రత్యేక అధికారి వివి సుబ్రహ్మణ్య సిద్ధాంతి కోరారు. దొడ్డిపట్లలో శనివారం జరిగిన జన భాగీదారీ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా మాట్లాడుతూ మూడేళ్ల వయస్సులో అంగన్‌వాడీల్లో చేరి ఐదేళ్లు వచ్చాక ప్రాథమిక పాఠశాలల్లో చేరే విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం, మూడేళ్లు వచ్చిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ జన భాగీదారీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న ఆహారాన్ని, ఆట వస్తువులను, పుస్తకాలను ప్రదర్శిస్తూ స్టాల్ ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో జన భాగీదారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్న), సర్పంచ్ ముచ్చర్ల దుర్గా భవానీ, ఉప సర్పంచ్ చేగొండి అంజికుమార్, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంధం శ్రీదేవి, గ్రామ కార్యదర్శి తోలేటి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: గర్భిణులు, బాలింతల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం వారికి ఎంతగానో దోహదపడుతుందని సీడీపీఓ ఊర్మిళ అన్నారు. నరసాపురం పట్టణంలోని 10వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో జనభాగీదారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఫంక్షన్‌ను నిర్వహించి ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కస్తూరి ఇందిరా, అడిదెల విజయ శ్యామల పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవిలో ఉన్న కాపులకొడపలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తుల సహకారంతో ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

రైతుల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



వల్లూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న లావణ్య

పెనుగొండ: రైతుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. శనివారం ఆచంట, వల్లూరు, ఆచంట వేమవరం, కరుగోరుమిల్లి పంచాయతీల్లో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పంట సాగుదారు హక్కు చట్టంపై కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి పంట సాగుదారు హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్‌లు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, నేలపూడి బేబీ, జక్కంశెట్టి చంటి, తహసీల్దారు ఎస్ సుబ్రహ్మణ్యం, వి నాగరాజు, సొసైటీ ఛైర్మన్‌లు వీర వీరభద్రం, నందిన వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 36 మంది ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం జరిగిన జాబ్‌మేళాలో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో జరిగిన హెటిరో లాబరేటరీస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 65 మంది విద్యార్థులు పాల్గొన్నారని వారిలో 36 మంది ఎంపికయ్యారన్నారు. వీరిలో 14 మంది చాంబర్స్ కళాశాల విద్యార్థులు ఉండడం అభినందనీయమని అన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ. 24 వేలు ప్రారంభ వేతనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెటిరో సంస్థ హెచ్.ఆర్ శీలంశెట్టి వంశీ, కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు, సెక్రటరీ కలిదిండి రామరాజు తదితరులు పాల్గొన్నారు.